


# వాన

ఇవటూరి శ్రీనివాస్

"ఎదవ వాన... ఎదవ వాన...!" గొణుక్కున్నాడు నారిగాడు.

పొద్దున్న లేచేసరికే ఆకాశం అంతా మబ్బులు కమ్మేశాయి. సుబ్బయ్య దగ్గరకి వెళ్లి సరకు తెచ్చుకునేలోపే చిన్నగా చినుకులు మొదలయ్యాయి. ప్లాట్ ఫామ్ మీదకి వచ్చాడో, లేదో మొదలయింది పాడు వాన! పెద్ద పెద్ద చినుకులు ... పైన రేకుల మీద చప్పుడు చేస్తూ ... అప్పటినుంచీ వాన తగ్గనేలేదు. దానికితోడు ఈ హోరు గాలి.

ప్లాట్‌ఫామ్ అంతా వానజల్లులతో తడిసిపోయింది. సిమెంటు బెంచిమీద మోకాళ్లపైన ముడుచుకుని కూర్చున్నాడు. పైన రేకులు చిల్లులు పడినచోటనుంచి పడుతున్న వాన. ఎదురుగా రైలుపట్టాల మీద వాన. స్టేషన్ అవతల పొలాల్లో వాన. దూరంగా కొండలపైన వాన. కనుచూపుమేర చుట్టూ ఎక్కడ చూసినా నీళ్లు. స్టేషన్ బయట గుడిసెలో నారిగాడి తల్లి కళ్లల్లో కన్నీళ్లు.

భుజంమీద చెయ్యి పడితే తలెత్తి చూశాడు. చెలమయ్య తాత.

"ఏం, నారిగా... లచ్చికి జొరం తగ్గలే?"

లేదన్నట్టు తలూపాడు.

నారిగాడి తండ్రి అదే స్టేషన్‌లో గాంగ్‌మన్‌గా పనిచేసేవాడు. దాదాపు ఆరేళ్లక్రితం ఓ రాత్రి తాగి సైకిల్ తొక్కుతూ బస్సుకిందపడి చచ్చిపోయాడు. అప్పుడు నారిగాడికి ఆరేళ్లు, లచ్చికి మూడేళ్లు. నారిగాడి తల్లి రోజూ పొద్దున్న, సాయంత్రం ఏడెనిమిది ఇళ్లల్లో పనిచేసి పిల్లల్ని పెంచుతోంది.

పక్కన లచ్చి లేకపోతే ఏదోలా ఉంది నారిగాడికి. వాళ్లిద్దరూ పెరిగింది ఆ ప్లాట్‌ఫామ్ మీదే! అదే వాళ్ల ప్రపంచం. పొద్దున్న లేస్తే ఇద్దరూ ఆడుకునేదీ, కొట్టుకునేదీ, తిట్టుకునేదీ ఆ ప్లాట్‌ఫామ్ మీదే! రోజూ పొద్దున్న కిరాణా కొట్టు సుబ్బయ్య దగ్గర బిస్కెట్ పాకెట్లూ, చాక్‌లెట్లూ, సిగరెట్లూ, బీడీలూ తీసుకుంటారు. అవన్నీ ఓ చిన్న జంగిడిలో పెట్టుకుని ప్లాట్‌ఫామ్‌పైకి వస్తారిద్దరూ. రైలు రాగానే నారిగాడు గట్టిగా




## రవీనకిది తెలుసా?

'సిరివెన్నెల' హీరోయిన్ మూన్‌మూన్ సేన్ గుర్తుందా? ఆమె కూతుళ్లలో ఒకతె రియాదేవ్‌వర్మ. ఆమె 'తాల్' హీరో అక్షయ్‌ఖన్నాతో చెట్టపట్టాలేసుకు తిరుగుతుండేది. ఇటీవల ఎందుకోగానీ, రియా అక్షయ్‌ను వదిలేసి పాపులర్ మోడల్‌బాయ్ జాన్‌అబ్రహామ్‌తో కనబడుతూందిట. 'తాల్' తరువాత అక్షయ్‌కు సినిమాల్లేకపోవడంతో రియాకు అతనిపట్ల ఆకర్షణ తగ్గిందట. అయినా రవీనాటాండన్‌కు రహస్య స్నేహితుడైన జాన్ ఇప్పుడు రియాతో కనబడుతుంటే రవీన ఊరుకుంటుందంటారా? ఏమో, చూడాలి. ఈ బాలీవుడ్ రంగంలో ఎవరి మూడ్ ఎప్పుడు మారుతుందో ఎవ్వరికీ అర్థం కాదు కదా!

ఎస్.

అరుస్తూ ఆ చివరనుంచి ఈ చివరదాకా అటూ ఇటూ గబగబా నడుస్తూంటాడు. వాడి వెనక లచ్చి. అది చిన్న స్టేషన్ కావటంతో బండ్లు ఎక్కువ సేపు ఆగవు. అందుకని ఎవరేది అడిగితే అది ఇస్తూ నారిగాడు ముందుకెళ్లిపోతుంటే, డబ్బులు వసూలు చేయటం, చిల్లర ఇవ్వటం లచ్చి పని. రైలు వెళ్లిపోయాక మళ్లీ ఆటలు మామూలే! రాత్రికి మిగిలిన సరుకు, డబ్బులూ సుబ్బయ్యకి అప్పచెబితే ఆ రోజు అమ్మకాన్నిబట్టి అయిదారు రూపాయలిస్తాడు. అవి తీసుకెళ్లి తల్లికియ్యటం, అన్నం తిని ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోవడం... ఇదీ వాళ్ల దినచర్య.

నిన్న మధ్యాహ్నం లచ్చికి బాగా తలపోటు వచ్చింది. రాత్రి ఇంటికెళ్లగానే అన్నం తినకుండానే పడుకుంది.



తొమ్మిదింటికి మూలుగుతుంటే తల్లి చూసింది. ఒళ్లు కాలిపోతోంది. రాత్రంతా తడిగుడ్డతో ఒళ్లు తుడుస్తున్నా కూడా జ్వరం తగ్గలేదు సరి కదా, ఇంకా ఎక్కువయింది. తెల్లారేసరికి మూలుగులు పెద్దవయ్యాయి.

"అమ్మా! లచ్చిని డాటరు దగ్గరకి తీసుకెళ్దామే!" అన్నాడు నారిగాడు ఏడుస్తూ.

కళ్లల్లోంచి నీళ్లు తప్ప, నోట్లోంచి మాటలు రాలేదు తల్లికి.

నారిగాడికి అర్థమయింది తల్లి దగ్గర డబ్బుల్లేవని. ఇవాళ సరుకు ఎలాగైనా ఎక్కువ అమ్మి, రాత్రి సుబ్బయ్య దగ్గర ఇంకో అయిదు రూపాయలు అప్పు అడిగి లచ్చిని డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లాలనుకున్నాడు. కానీ పొద్దున్నే పట్టుకుంది మాయదారి వాన!

"ఎదవ వాన.... ఎదవ వాన!" అంటూ గొణుక్కున్నాడు.

నారిగాడు లేచాడు. నెమ్మదిగా నడుచుకుంటూ స్టేషన్ బయటికి వచ్చాడు. వాన పడుతూనే ఉంది. నిక్కరు జేబులోంచి ఓ పాత ప్లాస్టిక్ కవర్ తీసి తలపైన తొడుక్కుని గుడిసెలోకి పరుగెత్తాడు.

లచ్చి మూలుగుతూనే ఉంది. తల్లి తడిగుడ్డతో తుడుస్తూనే ఉంది.

"నువ్వుండే...!" అంటూ తల్లిని ఆపి, తడిగుడ్డ తీసుకుని ఒళ్లంతా తుడుస్తూ కూర్చున్నాడు.

వాన తగ్గట్లేదు. లచ్చి జ్వరం తగ్గట్లేదు.

మళ్లీ పాసింజర్ వచ్చే టైముకి స్టేషన్‌లోకి వచ్చాడు. మళ్లీ మొదలు... మూసి ఉన్న రైలు కిటికీలకేసి ఆశగా చూస్తూ అరుస్తూ తిరుగుతున్నాడు.


"లచ్చీ..!" పిలిచాడు మొహంపైన వంగుని చూస్తూ. లచ్చి కళ్లు మూసుకునే ఉంది. నారిగాడు దిగాలుగా చూస్తూ అక్కడే నుంచున్నాడు.

దూరం నుంచి మెయిల్ కూత వినపడింది. తలమీద కవరు సరిచేసుకుంటూ గబగబా స్టేషన్‌కి పరుగెత్తాడు.

మెయిలొచ్చింది. జంగిడిమీద జల్లు పడకుండా రేకుల కింద రైలుకి దూరంగా నడుస్తూ అరుస్తున్నాడు. ఎవరైనా ఏదైనా అడిగితే జంగిడి కింద పెట్టి కావలసినది తీసుకుని రైలు దగ్గరకి పరుగెత్తి ఇస్తున్నాడు.

పది నిమిషాల తర్వాత రైలు వెళ్లిపోయింది. నెమ్మదిగా మళ్లీ సిమెంట్ బెంచ్ దగ్గరకి వచ్చాడు.

ఓ సిగరెట్ పాకెట్, రెండు బిస్కెట్ పాకెట్లు అమ్ముడయ్యాయి. వాన మూలంగా అందరూ కిటికీలు మూసుకుని కూర్చున్నారు. రోజూకన్నా ఎక్కువ సరుకు అమ్ముడవ్వాలనుకుంటే ఇయాల రోజూ అయ్యేంత కూడా అమ్ముడయ్యేలా లేదు.




నారిగాడికి లోపల నుంచి ఏడుపు తన్నుకొస్తోంది. వాన లేకపోతే గబగబా పరిగెడితే బాగానే అమ్ముడయ్యేవి. హఠాత్తుగా గాలి బాగా ఎక్కువయింది.

"ఎదవ వాన... ఎదవ వాన!" ఉక్రోషంగా తిట్టుకున్నాడు.

ఇంకో ముప్పావుగంట తర్వాత పాసింజర్ వచ్చేదాకా వేరే బండేమీ లేదు. జంగిడి తీసుకుని స్టేషన్ బయటికి వచ్చాడు. దానిపైన తుండుగుడ్డ వేసి గట్టిగా పట్టుకుంటూ గుడిసెలోకి పరుగెత్తాడు.

జంగిడి కిందపెడుతూ తలమీద కవరు తీసి లచ్చి పక్కన కూర్చున్నాడు.

"లచ్చీ!" అని పిలుస్తూ తలపైన చెయ్యేశాడు. కాలిపోతోంది ఒళ్లు.

"నువ్వుండే...!" అంటూ తల్లిని ఆపి, తడిగుడ్డ తీసుకుని ఒళ్లంతా తుడుస్తూ కూర్చున్నాడు.

వాన తగ్గట్లేదు. లచ్చి జ్వరం తగ్గట్లేదు.

మళ్లీ పాసింజర్ వచ్చే టైముకి స్టేషన్‌లోకి వచ్చాడు. మళ్లీ మొదలు... మూసి ఉన్న రైలు కిటికీలకేసి ఆశగా చూస్తూ అరుస్తూ తిరుగుతున్నాడు. ఎవరో ఒక్కరు కిటికీ తీసి సిగరెట్ పాకెట్ అడిగాడు. గబగబా తీసుకెళ్లిచ్చాడు. తీరా చూస్తే ఏభై రూపాయల నోటిచ్చాడతను. నారిగాడి దగ్గర చిల్లర లేదు. ఓపక్క బండెళ్లిపోతుందన్న కంగారు. చివరికి అతనే జాలిపడి వెతికి చిల్లరిచ్చాడు. నారిగాడు ముందుకు పరుగెత్తాడు.

రెండుసార్లు ప్లాట్‌ఫామ్‌పైన అటూ ఇటూ తిరిగాడు. ఇంకెవరూ ఏమీ కొనలేదు.

నారిగాడికి ఆపుకున్నా ఏడుపు ఆగటంలేదు. ఈ బండి కూడా వెళ్లిపోతే ఇంకో గంటకి మళ్లీ పాసింజర్ ఉందంతే! ఆ తర్వాత మళ్లీ రాత్రి తొమ్మిదింటిదాకా ఇంకేమీ రావు. ఇవాళ మొత్తంమీద అయిదారు రూపాయలు కూడా మిగిలేలా లేవు. లచ్చిని డాక్టరు దగ్గరకి ఎలా తీసుకెళ్లాలి?

దిగులుగా ఇంకోసారి రైలు చివరిదాకా నడిచాడు. ఎవరూ ఏమీ కొనలేదు. ఆఖరి పెట్టె దగ్గర వెనక్కి తిరుగుతుంటే తట్టింది వాడి కా విషయం.... ఇప్పటికి తను ఆ రైలు ఆ చివర నుంచి ఈ చివరిదాకా నాలుగుసార్లు తిరిగాడు. మామూలుగా మూడుసార్లు తిరిగేసరికే రైలు కదిలిపోతుంది.... అనుమానంగా సిగ్నల్‌కేసి చూశాడు. ఎర్రలైటు వెలుగుతోంది. ఏమీ అర్థం కాక ప్లాట్‌ఫామ్ మీదకి చూసిన నారిగాడికి స్టేషన్ మాస్టర్ రూము దగ్గర హడావుడి కనపడింది. నెమ్మదిగా అటు నడిచాడు.

స్టేషన్ మాస్టర్ ఎవరితోనో ఫోన్‌లో కంగారుగా మాట్లాడుతున్నాడు. చుట్టూతా చాలామంది గాంగ్‌మన్స్ ఉన్నారు. చెలమయ్య తాత కూడా అక్కడే ఉన్నాడు. నెమ్మదిగా దగ్గరకెళ్లి చెయ్యి పట్టుకుని లాగాడు.

"ష్...!" అంటూ సైగ చేస్తూ బయటకొచ్చి, "ఏంట్రా?" అన్నాడు విసుగ్గా చెలమయ్య తాత.

"ఏమయింది?"

"పెద్ద గాడవే వచ్చిపడిందిరా! గాలికి వంతెనలమీద చెట్లు విరిగి పట్టాలమీద పడ్డాయట. ఇందాక వెళ్లిన మెయిల్ అక్కడే ఆగిపోయిందట. ఇప్పుడవన్నీ తీసేదాకా బండ్లు పోవు...!"

"మరయితే ఈ పాసింజర్ ఇప్పుడు పోదా?"

"ఎక్కడికి పోతుందిరా...! ఈ వానలో రెండు కిలోమీటర్లు నడిచి వంతెనవతల కెళ్లి ఆ చెట్లన్నీ తియ్యాలి. అది గాంగ్‌మన్ ఒక్కళ్లతో అయ్యే పని కాదు. ఊళ్లో కూలీలకోసం కబురంపారు. ఆళ్లు రావాలి... చెట్లు తియ్యాలి... మెయిలెళ్లాలి... అప్పుడు ఈ బండి కదుల్తుద్ది! ఇదంతా అవటానికి కనీసం రెండు మూడు గంటలు పడుతుంది. ఈయాల మా పని జాతరే!" అంటూ లోపలికెళ్లాడు.

వాన కొంచెం తెరిపిచ్చింది.

అప్పుడప్పుడే పాసింజర్స్‌కి ఈ విషయం తెలిసి నెమ్మదిగా రైలు దిగుతున్నారు. కిటికీలు తెరుచుకుంటున్నాయి.

నారిగాడి మొహంలోకి కొంచెం వెలుగొచ్చింది. హుషారుగా జనం మధ్యలోకి పరుగెత్తాడు.

పది నిమిషాల్లో ఇంకో సిగరెట్ పాకెట్ అమ్ముడయిందంతే...

నారిగాడు నుంచున్న చోటికి కొంచెం దూరంలో సిగరెట్ తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు ఇద్దరు కుర్రాళ్లు.

"ఏయ్... బాబూ! ఇట్రా...! తింటానికేమున్నాయ్?" అని పిలిచాడొకతను.

గబగబా అటు పడిచాడు. "బిస్కెట్ పాకెట్ కావాలా సార్?" అన్నాడు జంగిడిలోంచి బిస్కట్ పాకెట్ తీస్తూ.

"ఛత్! ఈ వానలో చలేస్తుంటే, బిస్కెట్లు ఎవరు తింటారోయ్! వద్దులే...!"

అన్నాడింకొకతను.

నారిగాడి మొహం చిన్నబోయింది. మళ్లీ వాళ్లేమైనా మనసు మార్చుకుని కొంటారేమో అని ఆశగా అక్కడే నుంచున్నాడు.

"ఆకలి దంచేస్తోంది, గురూ! ఇంకో రెండు గంటలదాకా రైలు కదలదంటున్నారు. ఈ స్టేషన్ చూస్తే మరీ అధ్వాన్నంగా ఉంది. తింటానికి కూడా ఏమీ దొరికేలా లేవు. ఈ వానలో, చలిలో వేడి వేడి మిరపకాయ బజ్జీలు తింటే ఎంత బావుంటుందో...!" అన్నాడు మొదటి కుర్రాడు.

వాళ్లింక కొనరని అర్థమై నీరసంగా ముందుకు నడిచాడు.

ఇంకో అయిదు నిమిషాలు గడిచాయి. సరుకేమీ అమ్ముడవట్లేదు. రైలు ఎంతసేపాగినా తన గిరాకీ మాత్రం పెరగదనిపించింది నారిగాడికి. చేతలు నొప్పెడితే సిమెంట్ బెంచిమిద జంగిడి పెట్టి దూరంగా కూర్చున్నాడు. లచ్చి గుర్తొచ్చి కళ్లు మూసుకున్నాడు.

రెండు నిమిషాల తర్వాత హఠాత్తుగా లేచాడు.

జంగిడి తీసుకుని స్టేషన్ బయటికి నడిచాడు. వాన మళ్లీ మొదలైంది. తలమీద కవరు సరిచేసుకుంటూ గుడిసెలోకి పరుగెత్తాడు.

జంగిడి మూల పెట్టి జేబులోంచి డబ్బులన్నీ బయటకు తీసి లెక్కపెట్టాడు.

మొత్తం ముప్పై అయిదు రూపాయలున్నాయి. దిగ్గున లేచాడు. తలుపు చాటునున్న ప్లాస్టిక్ డబ్బా చేతిలోకి తీసుకున్నాడు. లచ్చి దగ్గర కూర్చున్న తల్లి ఏదో అడుగుతుంటే బదులు చెప్పకుండానే బయటికి పరుగెత్తాడు.

"ఏం కావాల్రా...?" అన్నాడు సుబ్బయ్య ఎదురుగా నుంచున్న నారిగాడిని చూసి.

చెప్పాడు.

"ఓర్నీ...! బండాగితే సరుకమ్ముకోకుండా, నీకు సెనగపిండీ, మంచి నూనె కావాల్సొచ్చాయా? ఎందుకురా... పకోడీలు చేసుకుంటావా?" అన్నాడు వెటకారంగా.

"ముందియ్యి!" అరిచినట్టన్నాడు నారిగాడు.

నూనె పోస్తుంటే ఎదురుగా కూరగాయలమ్మే రంగమ్మ దగ్గరకి పరుగెత్తాడు.... రొప్పుతూ, "పావుకిలో పచ్చి మిరపకాయలియ్యత్తా!" అన్నాడు.

ఇంటికి రాగానే మూలుగుతున్న లచ్చినీ, వింతగా చూస్తున్న తల్లినీ పట్టించుకోకుండా మూలనున్న కిరసనాయిలు స్టౌని బయటకు లాగాడు. వత్తులు సరిచేసి వెలిగించాడు. మూకుడు పెట్టి నూనె పోశాడు.

పచ్చిమిరపకాయలు కత్తితో కోసి గింజలు తీసేస్తూ, "అమ్మా...! చెల్లి జొరం తగ్గుతాదే! నువ్వోసారి లేయే...!" అన్నాడు.

తల్లి నెమ్మదిగా ఒళ్లోంచి లచ్చిని కింద పడుకోబెట్టి పైకి లేచింది.

పావుగంటయ్యేసరికి పదిహేను బజ్జీలు రెడీ అయ్యాయి. జంగిడిలో సిగరెట్ పాకెట్లు, బిస్కెట్‌లూ గట్రా బయటపెట్టి, బజ్జీలు పెట్టుకున్నాడు. సెనగపిండి విప్పిన పేపరు దానిపైన కప్పుతూ స్టేషన్లోకి పరుగెత్తాడు.

అటూ ఇటూ చూశాడు. జనం నెమ్మదిగా ప్లాట్‌ఫామ్ మీద ఏది దొరికితే దానిమీద సర్దుకుని కూర్చుంటున్నారు.

జంగిడిమీద పేపరు తీసేసి జనం మధ్యలోకి నడిచాడు...

రెండు నిమిషాలయింది ... ఎవరూ పిలవలేదు.

అప్పుడు చలనం వచ్చింది జనంలో. ఓ పక్క చల్లని గాలి... వాన.... వేడి వేడి బజ్జీలు...!

ఓ అయిదు నిమిషాల తర్వాత నారిగాడి జంగిడి ఖాళీ....! వాడి జేబులో పదిహేను రూపాయలు...!


గబగబా గుడిసెలోకి పరుగెత్తాడు. అక్కడింకో పది పైగా రెడీగా ఉన్నాయి. మళ్లీ స్టేషన్‌లోకి....

"అదుగో, మళ్లీ వచ్చాడు!" అన్నారెవరో...!

నారిగాడు అటూ ఇటూ తిరగక్కర్లేకుండా జనమే వాడి దగ్గరకు పరుగెత్తుకొచ్చారు.

జంగిడి ఖాళీ!

ఆ తర్వాతింక నారిగాడికి తలెత్తి చూసేంత తీరిక కూడా లేదు. ఎనిమిదింటికి ... రైలు కదిలేదాకా వాన పడుతూనే ఉంది. లచ్చి మూలుగుతూనే ఉంది. నారిగాడు పరుగెడుతూనే ఉన్నాడు ... గుడిసెలోంచి స్టేషన్లోకి ...




అయిదు నిమిషాలయింది ఎవరూ కొనట్లేదు.

నారిగాడిలో భయం మొదలైంది. పొద్దున్నుంచీ సుబ్బయ్య సరుకు అమ్మిన డబ్బంతా తను ఖర్చుపెట్టాడు. ఇప్పుడు ఇవి అమ్ముడు కాకపోతే, డబ్బుల్లేవంటే సుబ్బయ్య చంపేస్తాడు.

"ఒరేయ్... ఇట్రారా!" అంటూ పిలిచాడో లాల్చీ పైజమా తాలూకు శాల్తీ.

"మిరపకాయ బజ్జీ ఎంత?"

నారిగాడోసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని, "రూపాయికోటి!" అన్నాడు ధీమాగా.

ఓసారి తడిమి చూసి, "ఫర్వాలేదే ... వేడిగానే ఉన్నాయి! ఓ రెండియ్యి!" అన్నాడు లాల్చీ పైజమా.

స్టేషన్లోంచి గుడిసెలోకి.... మధ్యలో సెనగపిండి, నూనె కోసం సుబ్బయ్య దగ్గరకి, పచ్చిమిరపకాయలకి రంగమ్మత్త దగ్గరకి ... మళ్లీ గుడిసెలోకి ... స్టేషన్లోకి...

రాత్రి ఎనిమిదింటికి రైలు కదిలింది.

జంగిడిలో మిగిలిన ఆఖరి బజ్జీని చెలమయ్య తాతకిచ్చి చెప్పాడు. "తిను, తాతా... వేడిగా ఉంది!"

వాన తగ్గుముఖం పట్టింది.

నెమ్మదిగా గుడిసెలోకి నడిచాడు. జంగిడి కింద పెట్టాడు. కుండలోంచి నీళ్లు తీసుకుని తాగాడు.

జేబులో చేతులు పెట్టాడు. నిక్కరు రెండు జేబులూ, చొక్కా జేబూ ... మొత్తం చిల్లరా, కాగితాలూ కింద పోశాడు.

లెక్కపెట్టడం మొదలెట్టాడు.

ఇరవై... ముప్పై ... నలభై... నలభై అయిదు ... ఏభై...

నారిగాడి కళ్లు మెరిశాయి.

ఏభై అయిదు ... ఏభై ఎనిమిది ... అరవై ...

ఊపిరి పీల్చటం కూడా మానేశాడు.

అరవై రెండు ... మూడు... నాలుగు... పైన అరవై అయిదు పైసలు ...

ముప్పై అయిదు రూపాయలు పక్కకి తీశాడు. అది పెట్టుబడి పెట్టిన డబ్బు ... సుబ్బయ్యది.

సిగరెట్ పాకెట్లూ, బిస్కెట్లూ అన్నీ జంగిడిలో పెట్టుకుని బయటకొచ్చాడు.

"ఇదిగో, సుబ్బయ్యా! ఈ వేళ మిగిలిన సరుకు...! డబ్బు లెక్కపెట్టుకో!"

సరుకెంత మిగిలిందో చూసుకుని డబ్బు లెక్కపెట్టుకుని, సరిపోవటంతో సంతృప్తిగా తలూపుతూ, "ఇదిగో, నీ వాటా!" అంటూ అయిదు రూపాయలిచ్చి, "దీనికేం కానీ, నారిగా...! మిరపకాయబజ్జీలమ్మితే మొత్తం ఎంత మిగిలిందిరా?" అన్నాడు.

జవాబు చెప్పకుండా గబగబా గుడిసెలోకి నడిచాడు.

"అమ్మా! పదే, చెల్లిని డాటరు దగ్గరకి తీసుకెళదాం!"

లచ్చి వణుకుడు ఎక్కువయింది. బయట బాగా చలిగా ఉంది. తువ్వాలు తీసి లచ్చి చుట్టూ చుట్టి, చెవుల చుట్టూ ఇంకో గుడ్డ కట్టింది నారిగాడి తల్లి.

గుడి అవతల మర్రి చెట్టు దగ్గరుంది డాటరుగారి ఇల్లు. చూడగానే ఇంజెక్షన్ చేశాడు. మందులిచ్చి ఎప్పుడు వెయ్యాలో చెప్పాడు. పది రూపాయలు తీసుకున్నాడు.

వస్తుంటే మళ్లీ రంగమ్మత్త దగ్గర ఆగాడు నారిగాడు.

"ఏరా పిల్లాడా! బండెళ్లిపోయిందిగా ... ఇంకా మిరపకాయలు కావాలా?" అంది నవ్వుతూ.

తల అడ్డంగా ఊపుతూ, "మా చెల్లికి జొరం... వళ్లియ్యి!" అన్నాడు.

సుబ్బయ్య దగ్గర కిలో బియ్యం కొన్నాడు.

లచ్చి మూలుగు మానేసింది.

ఇంట్లోకొచ్చేసరికి తల్లి భుజంమీదే జోగటం మొదలెట్టింది. నెమ్మదిగా కిందికి దించి పళ్లు తినిపించి పడుకోబెట్టింది తల్లి.

"అమ్మా...! అన్నమొండే... ఆకలేత్తంది!" అంటూ నారిగాడు చెల్లి పక్కన పడుకున్నాడు. కాళ్లు బాగా నొప్పులెడుతున్నాయి. నెమ్మదిగా జేబు తడుముకున్నాడు. బజ్జీల్లో మిగిలింది ఇరవై తొమ్మిది రూపాయల అరవై అయిదు పైసలు. సుబ్బయ్య ఇచ్చింది అయిదు. అందులో డాటరుకి పది రూపాయలు, పళ్లకి అయిదు రూపాయలు, బియ్యానికి ఏడు రూపాయలు ...పోగా, మొత్తం పన్నెండు రూపాయల అరవై అయిదు పైసలు మిగిలాయి. ఆ డబ్బుల్ని గట్టిగా గుండెలకి హత్తుకున్నాడు.

అన్నం అయి తల్లి పిలిచేసరికి నారిగాడు గుర్రుపెడుతున్నాడు. బలవంతాన లేపితే నిద్రలోనే కాస్త తిని పడుకున్నాడు.

ఎవరో గట్టిగా తడుతున్నట్టయి మెల్లగా కళ్లు విప్పాడు నారిగాడు.

మీద పడుకుని ఊగుతూ నవ్వుతోంది లచ్చి.

ఒక్క ఉదటున లేచాడు. గట్టిగా పట్టుకుని, "లచ్చీ...! జొరం తగ్గిందే...?" అన్నాడు.

"ఆఁ... అమ్మ డాటరు దగ్గరకి తీసుకెళ్లిందిగా...!" అంది లచ్చి నవ్వుతూ.

నారిగాడికి చాలా సంతోషమయింది.

"మెయిలొచ్చే టైమైంది. పద, తొందరగా సరుకు తీసుకుని టేషను కెళ్దాం!" అంది లచ్చి.

అన్నా, చెల్లి జంగిడి తీసుకుని సరుకుకోసం సుబ్బయ్య దగ్గరకి బయలుదేరుతుంటే మొదలయింది మళ్లీ వాన.

"ఎదవ వాన... ఎదవ వాన...! మళ్లీ మొదలయింది!" విసుక్కుంది నారిగాడి తల్లి.

"అమ్మా...!" అరిచాడు నారిగాడు.

ఉలిక్కిపడి చూసింది తల్లి.

"అలా అనకే! వాన చాలా మంచిది. చెల్లి జొరం తగ్గించింది!" అన్నాడు నారిగాడు జేబులు తడుముకుంటూ, బయట వానలోకి నడుస్తూ. ■



## హృతిక్‌తో చేయాలనివుంది!

హృతిక్ రెండో చిత్రంలో, హీరోయిన్ ఎవరు? అనేది పెద్ద సమస్యయిపోయి కూర్చుందిప్పుడు. ఎందుకంటే 'కహో నా ప్యార్ హై' చిత్రం ఎలా నడుస్తుందో, అసలు పెట్టిన పెట్టుబడైనా వస్తుందో, లేదోనని భయపడుతూనే విడుదల చేశారు. నక్కను తొక్కివచ్చిన హృతిక్ అదృష్టం పండి, అది కాస్తా సూపర్ హిట్టయిపోయింది. ఇక వెంటనే మరో చిత్రం నిర్మించాలి కదా! తనకా అవకాశం వస్తుందేమోనని కళ్లు విప్పార్చి మరీ ఎదురుచూస్తూందట నేపాలీసుందరి మనీషాకోయిరాలా. కానీ మనీషతో హృతిక్‌కు పరిచయమే లేదట. పరిచయముంటే మనీష ఎటువంటి ప్లాన్లు వేసేదో ఏమోనంటున్నారు జనం. కరీనాకపూర్ కూడా తనకు అవకాశమిస్తాడేమో హృతిక్ అని ఆశపెట్టుకుని వుందట. ఎందుకంటే ముందు కరీననే అడిగారు 'కహో నా...' చిత్రానికి. అదేం బాగాపోతుంది లెమ్మని కరీన తల్లి బబితాకపూర్ మందలిస్తే, కరీన 'రెఫ్యూజీ' హీరోయిన్‌గా స్థిరపడింది. 'కరణ్ అర్జున్' చిత్రంలోని తన నటన గురించి చెప్పుకుంటూ మమతాకులకర్ణి కూడా రెడీ అయిందట హృతిక్ సరసన నటించడానికి! కానీ మమత తన కొడుక్కి తగినజోడీ కాదని తిరస్కరించేశాట్ట రాకేశ్‌రోషన్. చూద్దాం, అవే బయటికొస్తాయి సంగతులన్నీ!

ఎస్.